
అక్రమ పట్టాలపై చర్యకు అడిషనల్ కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తున్న గ్రామస్థులు (ఫైల్)

అధికారుల మెడకు డి-1 ఉచ్చు




మామడ మండలంలోని న్యూసాంగ్వి గ్రామంలో అక్రమంగా పొందిన డి-1 పట్టాల భూములు ఇవే


కలెక్టరేట్ ముందు బైఠాయించిన సిద్దిలకుంట గ్రామస్థులు (ఫైల్)

- జిల్లాలో అక్రమాలపై లోతుగా ఆరా తీస్తున్న నిర్మల్ ఎమ్మెల్యే
- ఏడీ ఆఫీసు సిబ్బంది పాత్రపై రహస్య విచారణ
- ఓ సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌ల అండతోనే భారీగా భూముల దందా
- అప్పటి జాయింట్ కలెక్టర్ అండతో రెచ్చిపోయిన కబ్జాదారులు
- ఎమ్మెల్యే చొరవతో రట్టుకానున్న గుట్టు

నిర్మల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : నిర్మల్ నియోజకవర్గంలో జరిగిన డి-1 పట్టాభూముల అక్రమాలపై రోజుకో రీతిన వాస్తవాలు వెలుగు చూస్తున్నాయి. ఈ కోట్లాది రూపాయల విలువైన డి-1 భూముల అక్రమాల వెనక అప్పటి బీఆర్ఎస్ పార్టీ నేతలతో పాటు ఇక్కడి ల్యాండ్ సర్వే డిపార్ట్‌మెంట్ ఏడీ ఆఫీసుకు సంబంధించిన ఓ జూనియర్ అసిస్టెంట్ అలాగే ఓ మండల సర్వేయర్ పాత్ర ఉన్నట్లు బహిరంగంగా ప్రచారం జరుగుతోంది. ఇప్పటికే అప్పటి మండల సర్వేయర్‌తో పాటు సదరు జూనియర్ అసిస్టెంట్‌పై కొంతమంది డి-1 బాధితులు ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి ఫిర్యాదు చేసినట్లు సమాచారం.



వీరి ఫిర్యాదుపై స్పందించిన ఎమ్మెల్యే అప్పటి సర్వేయర్ అలాగే ప్రస్తుత సర్వే ల్యాండ్ రికార్డ్స్ జూనియర్ అసిస్టెంట్‌ల అక్రమాలపై రహస్యంగా వివరాలు సేకరిస్తున్నట్లు సమాచారం. నిర్మల్ నియోజకవర్గంలో దాదాపు 2వేల ఎకరాల భూములకు పైగా డి-1 పట్టాల పేరిట అక్రమాలు జరిగినట్లు ఆరోపణలున్నాయి. ఈ డి-1 అక్రమాలపై ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి నాలుగైదు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డిని స్వయంగా కలిసి ఫిర్యాదు చేయడమే కాకుండా విచారణ జరిపించాలంటూ ఒత్తిడి తీసుకు రానున్నట్లు సమాచారం. అప్పటి మంత్రి ఇంద్రకరణ్‌రెడ్డి బంధువులతో పాటు అప్పటి బీఆర్ఎస్ పార్టీ నేతలు సంబంధిత అధికారులపై ఒత్తిడి తీసుకువచ్చి ఈ దందాను కొనసాగించినట్లు ఆరోపణలున్నాయి. కాగా అప్పటి సర్వేయర్, జూనియర్ అసిస్టెంట్‌లు నకిలీ డి-1 పట్టాల పేరిట దాదాపు 40 ఎకరాలకు పైగా భూములను కాజేసినట్లు కూడా ఫిర్యాదులు వెల్లువెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలోనే ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి గత రెండు రోజుల నుంచి రెవెన్యూ, సర్వే ల్యాండ్ రికార్డ్స్ అధికారులతో పలు దఫాలుగా సమీక్ష జరిపి మొత్తం భూముల వివరాలను తనకు అందించాలని కోరడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. డి -1 పట్టాల పేరిట జరిగిన భూముల కుంభకోణంపై ఇప్పటికే ప్రభుత్వానికి పలువురు ప్రజా సంఘాల నేతలు, సమాచార చట్టం సభ్యులు ఫిర్యాదు చేసినట్లు సమాచారం. ఎస్సారెస్పీ ముంపు బాధితుల పేరిట అప్పటి నేతలు, ఒకరిద్దరు అధికారులు డి-1 పట్టాల రాకెట్‌ను యథేచ్ఛగా కొనసాగించారన్న విమర్శలున్నాయి. 2014 సంవత్సరం నుంచి మొదలుకొని 2018 సంవత్సరం వరకు డి-1 పట్టాలతో పెద్దఎత్తున భూములను కబ్జా చేసినట్లు పేర్కొంటున్నారు. నిబంధనలకు విరుద్ధంగా నకిలీ డి-1 పట్టాలను సృష్టించి తమకున్న రాజకీయ పలుకుబడి, పరపతితో ఆ పట్టాలను రికార్డుల్లో ఎక్కించారన్న ఫిర్యాదులు వెలువడుతున్నాయి. ఎస్సారెస్పీ డిప్యూటీ కలెక్టర్ పేరిట దాదాపు మూడు వందలకు పైగా నకిలీ డి-1 పట్టాలను సృష్టించారంటున్నారు. అయితే ఈ డి-1 పట్టాలను మొదట్లో ముంపు బాధితుల పేరిట సృష్టించి ఆ తరువాత వాటిని తమ పేరిట రిజిస్ట్రేషన్‌లు చేసుకున్నట్లు చెబుతున్నారు. నకిలీతో మొదలై తప్పుడు డాక్యుమెంట్‌లతో ఈ వ్యవహారాన్నంత అసలుగా మలుచుకోవడం వెనక అప్పటి సర్వేయర్‌తో పాటు ఏడీ ఆఫీసు జూనియర్ అసిస్టెంట్ పాత్ర ఉన్నట్లు బహిరంగ ఆరోపణలున్నాయి. దిలావర్‌పూర్ మండలంలో ఇలాంటి నకిలీ డి-1 పట్టాల పేరిట సదరు జూనియర్ అసిస్టెంట్ దాదాపు 20 ఎకరాలకు పైగా భూమిని డి-1 పట్టా పేరిట స్వాహా చేసినట్లు అక్కడి మండల వాసులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికే ఈ భూములపై గ్రామస్థులు ఆందోళనలకు దిగడమే కాకుండా ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డికి సైతం ఫిర్యాదు చేసి తమ భూములను కాపాడాలంటూ కోరారు. కాగా నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో కొంతమంది రాజకీయ అండదండలతో డి-1 పట్టాల భూముల దందాల్లో దళారులుగా కూడా వ్యవహరించారంటున్నారు. బోగస్ పేర్లపై డి-1 పట్టాలను సృష్టించి ఆ తరువాత తమ పేరిట వాటిని పేరు మార్పిడి చేసుకున్నారంటున్నారు. నిర్మల్ రూరల్ మండలంలోని న్యూ పోచంపాడ్, రత్నాపూర్ కాండ్లీ, భాగ్యనగర్, మామడ మండలంలోని న్యూసాంగ్వి, న్యూ లింగంపల్లి, ఆదర్శనగర్‌తో పాటు తదితర గ్రామాల్లో పెద్దఎత్తున ఈ అక్రమ డి-1 పట్టా భూముల ఆక్రమణల పర్వం కొనసాగిందంటున్నారు. కేవలం మామడ మండలంలోని న్యూ సాంగ్వి గ్రామంలోనే దాదాపు 150 ఎకరాల భూమిని డి-1 పట్టాల పేరిట కబ్జా చేశారన్న ఆరోపణలున్నాయి. ఈ ఆరోపణల తతంగంపై ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి సీరియస్‌గా దృష్టి సారించడమే కాకుండా ఉన్నతస్థాయిలో విచారణ జరిపించేందుకు ప్రయత్నాలు మొదలు పెట్టడంతో అక్రమార్కుల్లో దడ మొదలైందంటున్నారు.

డి-1 పట్టా అక్రమాలపై ఎమ్మెల్యే సీరియస్

నిర్మల్ నియోజకవర్గంలో జరిగిన డి-1 పట్టా భూముల అక్రమాలపై స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి సీరియస్‌గా దృష్టి సారించడంతో అక్రమార్కుల్లో దడ మొదలైందంటున్నారు. అప్పటి బీఆర్ఎస్ పార్టీ హయాంలో జరిగిన ఈ అక్రమ భూదందా గుట్టును రట్టు చేయాలన్న పట్టుదలతో ఎమ్మెల్యే వ్యవహరిస్తుండడం ప్రాధాన్యతను సంతరించుకుంటోంది. అప్పటికే ఎమ్మెల్యే సంబంధిత అధికారులతో సమీక్ష నిర్వహించి అక్రమాలపై ఆరాతీశారు. అలాగే దీనిపై ప్రత్యేక నివేదికను కూడా రూపొందింపజేశారు. ఈ నివేదికను ఫిర్యాదు రూపంలో సీఎం రేవంత్‌రెడ్డికి స్వయంగా అందించడమే కాకుండా అవసరమైతే అసెంబ్లీలో కూడా ఈ వ్యవహారాన్ని లేవనెత్తేందుకు ఆయన సిద్ధమవుతున్నారు. గత మూడు రోజుల నుంచి నిర్మల్ నియోజకవర్గంలో అక్రమ డి-1 పట్టాల దందానే హాట్‌టాపిక్‌గా మారడం విశేషం. మొదటి నుంచి నిక్కచ్చిగా వ్యవహరించే ఎమ్మెల్యే డి-1 పట్టాల అక్రమాలపై పట్టు వదలని విక్రమార్కుడిలా వ్యవహరిస్తుండడం ఆసక్తికరంగా మారుతోందంటున్నారు.

సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ శాఖపై అనుమానాలు

స్థానిక సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఆఫీసులోని ఓ జూనియర్ అసిస్టెంట్‌తో పాటు అప్పటి మండల సర్వేయర్ పాత్రపై సర్వత్రా చర్చ జరుగుతోంది. అప్పట్లో ఈ శాఖకు జిల్లా అధికారిగా వ్యవహరించి స్వచ్ఛందం పదవీ విరమణ పొందిన సదరు అధికారిని వీరిద్దరు బోల్తా కొట్టించారన్న ఆరోపణలున్నాయి. అధికారిని సైతం వీరిద్దరు తమ అక్రమ భూదందాలో వ్యూహాత్మకంగా భాగస్వామిని చేసి తిలా పాపం తలా పిడికేడు అన్న చందంగా భాగస్వామ్యం కల్పించారంటున్నారు. అప్పటి సర్వేయర్‌కు మాజీ మంత్రి అండదండలు పుష్కలంగా ఉండడంతోనే సంబంధిత శాఖలో ఆయన ఇష్టారాజ్యంగా వ్యవహరించారన్న ఆరోపణలున్నాయి. ఈ సర్వేయర్ అండదండలతోనే మాజీ మంత్రి బంధువులు, అప్పటి బీఆర్ఎస్ పార్టీ నేతలు ఈ అక్రమ డి-1 పట్టాల దందాను యథేచ్ఛగా కొనసాగించారంటున్నారు. ఈ సర్వేయర్‌కు ఉన్న రాజకీయ పలుకుబడితో సదరుశాఖ ఉన్నతాధికారులు సైతం ఏమీ చేయలేని పరిస్థితి కొనసాగిందని అంటున్నారు. ఎన్నికలకు ముందు అప్పటి సర్వేయర్ తాను రెగ్యులర్ సర్వేయర్‌గా ఉన్న మండలంతో పాటు డి-1 పట్టా భూములతో సంబంధం ఉన్న మామడ మండలానికి కూడా ఇన్‌చార్జీ బాధ్యతలు తీసుకున్నారంటున్నారు. ఈయన నిర్వాహకం కారణంగానే న్యూలింగంపల్లిలో దాదాపు 180 ఎకరాల సర్కారు భూమి డి -1 పట్టాల పేరిట మంత్రి బంధువులకు అంటగట్టారంటున్నారు. మొత్తానికి ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి ఈ భూముల అక్రమాలపై సీరియస్‌గా దృష్టి సారించడంతో ఇక ఎలాంటి పరిణామాలు చోటు చేసుకుంటాయోనన్న ఆసక్తి సర్వత్రా వ్యక్తమవుతోంది.

వాడవాడలా

మార్మోగుతున్న శ్రీరామ నామస్మరణ


భైంసాలోని రాజీవ్‌నగర్ కాలనీ హన్మాన్ మందిరంలో జరుగుతున్న శ్రీరామ నామ పారాయణం

భైంసా, జనవరి 20 : రెవెన్యూ డివిజన్ కేంద్రమైన భైంసా పట్టణం శ్రీ రామ నామస్మరణంతో మార్మోగిపోతోంది. అయోధ్యనగరిలో సోమవారం జరుగనున్న ప్రతిష్ఠాపన మహోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణ పరిధిలోని వాడవాడలా శోభయాత్రలు, ప్రభాత్ బేరీ, భజన కార్యక్రమాలు జోరుగా కొనసాగుతున్నాయి. ఆయా కాలనీల్లోని ఆలయాల్లో ఉదయం, రాత్రి పూట కొనసాగుతున్న శ్రీ రామ పారాయణంలో మహిళలు అధిక సంఖ్యలో పాల్గొంటున్నారు. వాడవాడల శ్రీరాముని చిత్ర పటాలతో నిర్వహిస్తున్న శోభయాత్రలకు భక్తులు అధికంగా హజరవుతున్నారు. ఇక సోమవారం జరుగనున్న ప్రాణ ప్రతిష్ఠను పురస్కరించుకొని వీధి వీధిన కార్యక్రమాలకు రూప కల్పన జరిగింది. ప్రతి ఆలయంలో ఉదయం హనుమాన్ చాలీసా, శ్రీ రామ నామ పారాయణం నిర్వహించనున్నారు. అనంతరం పలు ప్రాంతాల్లోని ఆలయాల్లో ప్రాణ ప్రతిష్ఠాపన ప్రత్యక్ష ప్రసారాలను వీక్షించేందుకు గాను ఎల్ఈడీ, డీజిటల్ స్ర్కీన్స్ ఏర్పాట్లకు రంగం సిద్ధ చేశారు. ఇదే క్రమంలో ప్రతి ఆలయం ప్రాంగణంలో ప్రాణ ప్రతిష్ఠాపన పూజలు ముగిసిన అనంతరం భారీ అన్నదాన కార్యక్రమాలు జరుగనున్నాయి. ఇప్పటికే పలు ప్రాంతాల్లోని ఆలయాలకు విద్యుత్ దీపాలను అలంకరించి శోభయమానంగా తీర్చిదిద్దారు. ఆదివారం రాత్రి ఆలయాలన్నింటికి పూలమాలలు, మామిడి తోరణాలతో అలంకరించనున్నారు.

చిన్నారులకు శ్రీరామ వేషధారణ పోటీలు


శ్రీ రాముడు, సీతాదేవి, లక్ష్మణుడి వేషధారణలో చిన్నారులు

ముథోల్, జనవరి 20 : అయోధ్యలో 22న శ్రీ రాముని ప్రాణప్రతిష్ఠ సందర్భంగా రబీంద్ర పాఠశాలలో శనివారం శ్రీ రాముడు, సీతాదేవి, లక్ష్మణ వేషధారణ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా రాముని మందిరం ముగ్గుల ద్వారా వేసి తన భక్తిని చాటుకున్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

అధైర్య పడకండి .. అండదండగా నిలుస్తా

- ముథోల్ బీఆర్ఎస్ శ్రేణులతో మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి



భైంసా, జనవరి 20 : అసెంబ్లీ ఎన్నికల్లో పరాజయం పాలయ్యామని అధైర్యపడవద్దని, అన్నింటికీ తాను అండదండగా నిలుస్తానని ముథోల్ మాజీ ఎమ్మెల్యే విఠల్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం భైంసా పట్టణంలో ముథోల్ మండల బీఆర్ఎస్ శ్రేణులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఎన్నికలన్నపుడు గెలుపు, ఓటములు సహజమని, ఓడినపుడు కృంగిపోకూడదన్నారు. పరాజయానికి గల కారణాలు,లోపాలను సవరించుకొని ముందుకు సాగుదామన్నారు. సమస్యలపై నిరంతరం ప్రజా క్షేత్రంలో ఉద్యమిద్దామన్నారు. బీఆర్ఎస్ అధిష్ఠానం పార్టీ బలోపేతానికి, శ్రేణుల సంక్షేమానికి బాధ్యతతో వ్యవహరిస్తుందని భరోసా కల్పించారు. పార్టీ మార్పు ప్రస్తావన తీసుకరాగా అలాంటి ఆలోచనలు పెట్టుకోవద్దని సూచించారు. ఇందులో మండల పరిధిలోని పార్టీ ప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములపై రీ సర్వే చేయిస్తాం

- అక్రమాలపై విచారణ కోసం త్వరలోనే సీఎంను కలుస్తా
- ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిని వదిలిపెట్టం
- నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్ రెడ్డి


కదిలి ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్ రెడ్డి


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి

నిర్మల్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి) : గత పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో నిర్మల్ నియోజకవర్గంలో ఆక్రమణలకు గురైన ప్రభుత్వ భూములపై రీసర్వే చేపడతామని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఈ విషయమై త్వరలోనే ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేయిస్తామన్నారు. ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం చేసి, ఆక్రమించిన వ్యక్తులను చట్టపరంగా శిక్షిస్తామని హెచ్చరించారు. శనివారం నిర్మల్‌లోని ఆయన నివాసంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మహేశ్వర్‌రెడ్డి మాట్లాడారు. బీఆర్ఎస్‌కు చెందిన కొందరు నాయకులు, మాజీ మంత్రి కుటుంబ సభ్యులు... భూనిర్వాసితుల పేరిట డి-1 పట్టాలు పొంది భారీ భూమాఫియాకు పాల్పడ్డట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. భూ నిర్వాసితుల భూముల పేరిట భారీ రాకెట్ నడిచిందని, దాదాపు 2 వేల ఎకరాలకు పైగా డి-1 పట్టాలతో ప్రభుత్వ భూములను గత పాలకులు కబ్జా చేశారని ఆరోపించారు. ఎస్ఆర్ఎస్పీ ముంపు బాధితులతో గత పాలకులు చెలగాటమాడారని, ఈ భూ కుంభకోణంలో కొందరు అధికారుల పాత్ర కూడా ఉన్నట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. బోగస్ పేర్ల మీద ఇతరులకు డి-1 పట్టాలు చేయడంతో నిర్మల్ గ్రామీణ మండలం కొత్త పోచంపాడ్, మామడ మండలం న్యూసాంగ్వి, లింగంపల్లి, ఆదర్శనగర్ తదితర గ్రామాలకు చెందిన ప్రజలు తీవ్రంగా నష్టపోయారన్నారు. ఒక్క సాంగ్వి గ్రామంలోనే దాదాపు 180 ఎకరాల భూములను డి-1 పట్టాల పేరిట కబ్జా చేశారని ఆరోపించారు. అక్రమాలకు పాల్పడ్డవారు ఎంతటి వారైనా వదిలిపెట్టే ప్రశ్నే లేదని ఈ సందర్భంగా హెచ్చరించారు. ఈ సమావేశంలో బీజేపీ నాయకులు రావుల రాంనాథ్, తక్కల రమణారెడ్డి, రమేష్, సాగర్, భూపతిరెడ్డి, భూపాల్‌రెడ్డి, చంద్రకాంత్, ఒడిసెల అర్జున్, జమాల్, వీరేష్, శ్రావణ్, తదితరులు పాల్గొన్నారు.

రాముని ఫోటో, జెండా ఆవిష్కరించిన ఎమ్మెల్యే

నిర్మల్ కల్చరల్ : అయోధ్య రామ మందిర ప్రారంభోత్సవం సందర్భంగా శనివారం నిర్మల్‌లో ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి శ్రీరాముని ఫోటో, జెండాతో పాటు దీపాలను ఆయన నివాసంలో ఆవిష్కరించారు. భైంసా మార్కెట్ కమిటీ చైర్మన్ జాదవ్ రమేష్‌బాబు, రావుల రాంనాథ్, సాధం అరవింద్, తదితర నాయకులు పాల్గొన్నారు.

అయోధ్య రామాలయం దేశ సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనం

దిలావర్‌పూర్ : అయోధ్యలో నిర్మించిన రామాలయం భారతదేశ గొప్ప సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనమని నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని కదిలి పాపహరేశ్వర స్వామిని దర్శించుకుని ప్రత్యేకపూజలు చేశారు. అనంతరం ప్రధాని నరేంద్రమోదీ పిలుపు స్వచ్ఛ తీర్థ అభియాన్‌లో భాగంగా కదిలి పాపహరేశ్వరాలయం పరిసరాలను ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి శుభ్రం చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ఈ నెల 22న అయోధ్యలో జరగబోయే రామమందిరంలో బాలరాముని ప్రాణప్రతిష్ఠ కార్యక్రమం కోసం యావత్ ప్రపంచమంతా ఎదురు చూస్తోందన్నారు. ప్రతి ఒక్క రూ ఈ మహా కార్యక్రమంలో భాగస్వాములవ్వాలని కోరారు. అద్భుతమైన అయోధ్య రామాలయ కట్టడంలో హస్తకళ నైపుణ్యం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రావుల రాంనాథ్, ముత్యం రెడ్డి, వీరేష్, రమేష్, శైలేష్, చంద్రకాంత్, ప్రవీణ్, నారాయణ, రాజు, దినేష్, విజయ్‌లతో పాటు పలువురు బీజేపీ కార్యకర్తలు పాల్గొన్నారు.

బూరుగుపెల్లి ఆలయాన్ని శుభ్రపరిచిన ఎమ్మెల్యే

మామడ, జనవరి 20 : ప్రధాని నరేంద్రమోదీ పిలుపు మేరకు స్వచ్ఛ తీర్థ అభియాన్‌లో భాగంగా శనివారం నిర్మల్ నియోజకవర్గంలో అతి పురాతన దేవాలయం అయినా మామడ మండలం బూరుగుపెల్లి గ్రామంలోని శ్రీ రాజ రాజేశ్వరస్వామి శివాలయంను దర్శించుకొని ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆలయాల పరిసరాలను శుభ్రం చేశారు. అనంతరం ప్రత్యేకపూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ఈ నెల 22న అయోధ్యలో జరగబోయే రామ మందిర ప్రాణ ప్రతిష్ఠ కార్యక్రమం కోసం యావత్ ప్రపంచమంతా ఎదురుచూస్తున్న తరుణంలో ప్రతి ఒక్కరూ ఈ కార్యక్రమంలో భాగస్వామ్యం అవ్వాలని కోరారు. అద్భుతమైన అయోధ్య రామాలయ నిర్మాణం భారతదేశపు గొప్ప సాంస్కృతిక వారసత్వానికి నిదర్శనం. కట్టడంలో ఉన్న హస్తకళ నైపుణ్యం విస్మయాన్ని కలిగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో రావుల రాంనాథ్, హేమ్లానాయక్, జుట్టు దినేష్, ఎంపీటీసీ చారణ్య జాలం నాయక్, లక్ష్మణచాంద ఎంపీపీ పద్మ రమేష్, మండల బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి 'నిర్మల్ జిల్లా సమగ్ర స్వరూపం' అందజేత


హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవికి సంఘ డైరీని అందజేస్తున్న దృశ్యం

నిర్మల్ అర్బన్, జనవరి 20 : జిల్లాకేంద్రంలోని స్థానిక సీనియర్ కాంగ్రెస్ నాయకులు కూచాడి శ్రీహరిరావు గృహంలో కలిసి హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవిని శాలువాతో సన్మానించి, జిల్లా సమగ్ర స్వరూపాన్ని అందజేసినట్లు కోర్ కమిటీ కన్వీనర్ డా.తుమ్మల దేవరావు తెలిపారు. ఈ సందర్భంగా పుస్తకం విశిష్ఠతను హైకోర్టు న్యాయమూర్తికి వివరిస్తూ... ఇది జిల్లా ఐదు వేల సంవత్సరాల చరిత్రను రికార్డు చేసిందన్నారు. రచయితలు ఎంతో శ్రమించి లోతైన అంశాలను రికార్డు చేయడం అభినందనీయమని న్యాయమూర్తి కొనియాడారు. బావితరాలకు సమాచారం అందిస్తుం దన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కూచాడి శ్రీహరిరావు, కోర్ కమిటీ సభ్యులు, తెరవే జిల్లా అధ్యక్షులు నేరెళ్ల హన్మంతు, వ్యాస రచయితలు కామారపు జగదీశ్వర్, పత్తి శివప్రసాద్, అబ్బడి రాజేశ్వర్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఇంజనీర్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు కామారపు జగదీశ్వర్ హైకోర్టు న్యాయమూర్తి జువ్వాడి శ్రీదేవికి సంఘ డైరీని బహూకరించారు.


న్యూ లోలంలో బీఎల్‌వోలతో మాట్లాడుతున్న ఆర్డీవో

ప్రత్యేక ఓటరు నమోదును పరిశీలించిన ఆర్డీవో

దిలావర్‌పూర్, జనవరి 20 : మండలంలోని సిర్గాపూర్, న్యూ లోలం గ్రామాల్లో శనివారం ఆర్డీవో రత్న కళ్యాణి ప్రత్యేక ఓటరు నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. నూతన ఓటరు నమోదుతో పాటు ఓటరు కార్డులో తప్పులుంటే సరిచేసుకోవాలని ఆర్డీవో సూచించారు. ఈ అకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. ఆర్డీవో వెంట తహసీల్దార్ సరిత, ఎంఆర్ఐ సంతోష్, తదితరులున్నారు.

సంక్షిప్త సమాచారం

సీఐటీయూలో మున్సిపల్ కార్మికుల చేరిక


సమావేశంలో మాట్లాడుతున్న నాయకుడు

నిర్మల్ కల్చరల్, జనవరి 20 : నిర్మల్ మున్సిపల్ కార్మిక సంఘాలకు చెందిన కార్మికులు శనివారం సీఐటీయూలో చేరినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ తెలిపారు. శనివారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ... 64 మంది కార్మికులు చేరారన్నారు. వారిని పార్టీలోకి ఆహ్వానించారు. సీఐటీయూ ఆధ్వర్యంలో సమస్యలు పరిష్కారమవుతున్నాయన్నారు. మున్సిపల్ కార్మికులకు 16,600ల కేటగిరీ వారీగా వేతనాలు అమలు చేయాలన్నారు. కనీస వేతనం 26 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించి గుర్తింపు కార్డు ఇవ్వాలని కోరారు. కిషన్‌కుమార్, డి. పోశెట్టి, రాజమణి, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరం

నిర్మల్ కల్చరల్, జనవరి 20 : జిల్లాకేంద్రం మాతాశిశు ఆరోగ్యకేంద్రంలోని డిస్ట్రిక్ట్ ఎర్లీ ఇంటర్వేషనల్ కేంద్రంలో శనివారం ఉచిత గుండె వైద్య శిబిరాన్ని నిర్వహించారు. జిల్లా వైద్యాధికారి ధనరాజ్ ఈ శిబిరాన్ని ప్రారంభించారు. 178 మందికి పరీక్షలు జరిపి 54 మందిని తదుపరి పరీలకు హైదరాబాద్ సిఫార్సు చేశారు. కిమ్స్ ఆసుపత్రి డాక్టర్ సుదీప్ వర్మ, ప్రోగ్రాం అధికారి నయనారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

పాఠశాలలకు 22న సెలవు ప్రకటించాలి

నిర్మల్ కల్చరల్, జనవరి 20 : ఈ నెల 22న అయోధ్యలో రామ మందిర ప్రారంభోత్సవం, ప్రాణ ప్రతిష్ఠ సందర్భంగా జిల్లాలోని విద్యాసంస్థలు, పాఠశాలలకు ప్రభుత్వం సెలవు ప్రకటించాలని బీజేపీ పట్టణ అధ్యక్షుడు సడన్ అరవింద్ ఒక ప్రకటనలో శనివారం డీఈవోను కోరారు. దేశవ్యాప్తంగా పూజలు, అన్నదానం, ఆధ్యాత్మిక కార్యక్రమాలు నిర్వహించనున్నారని తెలిపారు.

ఓంకారేశ్వర క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నిర్మల్ కల్చరల్, జనవరి 20 : నిర్మల్ పట్టణంలో ఓంకారేశ్వర క్రికెట్ టోర్నమెంట్ శనివారం మున్నూరు కాపు సంఘం అధ్యక్షుడు గొజ్జ సుదర్శన్ ప్రారంభించారు. బాలాజీ జువెలర్స్ ఈ పోటీలు నిర్వహిస్తోంది. కౌన్సిలర్ లక్కాకుల నరహరి, మాజీ కౌన్సిలర్ కూన రాజేశ్వర్, సంఘ పెద్దలు పాల్గొన్నారు.

పాఠశాలకు బ్యాండ్ వితరణ



కుభీర్ , జనవరి 20 : మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో 1999-2000 విద్యాసంవత్సరంలో పదోతరగతి చదువుకున్న విద్యార్థులు తమ పాఠశాల అభివృద్ధి తమవంతుగా విరాళాన్ని అందజేశారు. రూ. 16వేలు విలువ చేసే బ్యాండ్, అన్ని రకాల ఇన్స్ట్రుమెంట్స్, పోడియంను అందజేశారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సాయన్న, 1999-2000బ్యాచ్ విద్యార్థులు కందూర్ శ్రీనాథ్, వైద్యనాథ్, వసీం, నరేందర్‌గౌడ్, తదితరులున్నారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎస్‌ఆర్ డీజీ స్కూల్ విద్యార్థి ఎంపిక

నిర్మల్ కల్చరల్, జనవరి 20 : నిర్మల్ ఎస్‌ఆర్ డీజీ స్కూల్ విద్యార్థి జోహాబ్ జాతీయ స్థాయిలో జరిగే టెన్నిస్, క్రికెట్ పోటీలకు ఎంపికైనేట్లు జోనల్ ఇన్‌చార్జి దేవిదాస్ తెలిపారు. శనివారం ఆయన విద్యార్థిని అభినందించారు. ఉత్తరాఖండ్‌లో జరిగే టెన్నిస్, క్రికెట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచారన్నారు. ప్రిన్సిపాల్ శిరీష, పాఠశాల యాజమాన్యం పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించండి

మంత్రి సీతక్కను కలిసిన శ్రీహరిరావు



మంత్రి సీతక్కను కలిసి వినతిపత్రం ఇస్తున్న శ్రీహరిరావు

లక్ష్మణచాంద, జనవరి 20 : మండలంలోని బోరిగాం గ్రామంలో గల ప్రభుత్వ భూమిలో పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని నిర్మల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, పంచాయతీ రాజ్, మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్కను కలిసి డీసీసీ అధ్యక్షుడు శ్రీహరి రావు శుక్రవారం వినతి పత్రం సమర్పించారు. హైదరాబాద్ వెళ్లి సచివాలయంలో ఆమెను కలిసి ప్రత్యేకంగా విన్నవించారు.

ఐకేపీలకు 18 వేలు చెల్లించాలని వినతి

నిర్మల్ కల్చరల్, జనవరి 20 : మెప్మా పరిధిలో పని చేసే ఐకేపీలకు గౌరవ వేతనం రూ. 18 వేలు చెల్లించేలా చర్యలు తీసుకోవాలని ఐకేపీ రిసోర్స్ పర్సన్లు కోరారు. శుక్రవారం డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావుకు వినతిపత్రాన్ని అందజేశారు. 7 నెలలుగా కనీస వేతనాలు చెల్లించడం లేదన్నారు. గత ప్రభుత్వం కేవలం నాలుగువేల గౌరవవేతనం చెల్లించారని, వెట్టిచాకిరి చేయించారని పేర్కొన్నారు. జీవో 164తో నష్టపోతున్నామని దానిని రద్దు చేయించి.. తమకు న్యాయం చేయాలని కోరారు.



ముత్యాల తలంబ్రాల ఊరేగింపులో పాల్గొన్న ఎమ్మెల్యే పాయల శంకర్

అయోధ్య రామయ్య ప్రాణప్రతిష్ఠ మహోత్సవానికి ముత్యాల తలంబ్రాలు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 20: అయోధ్య రామజన్మ భూమిలో జరుగుతున్న ప్రాణ ప్రతిష్ఠ మహోత్సవానికి భద్రాచలం నుంచి ముత్యాల తలంబ్రాలు హిందు సమాజం ఆధ్వర్యంలో వెళ్లాయి. ఈ తలంబ్రాలు జిల్లాకేంద్రంలో ఊరేగించి తీసుకుని వెళ్లారు. ఈ ఊరేగింపు ఎమ్మెల్యే పాయలశంకర్ ఆధ్వర్యంలో ఊరేగించి గోపాలకృష్ణ మఠం వద్ద పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ యావత్‌ప్రపంచ హిందువులు కన్నుల పండుగల ఈ మహోత్సవాన్ని జరుపుకుంటున్నారన్నారు. 500 ఏళ్ల హిందువుల కల ప్రధాని మోదీ నెరవేర్చారని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఇప్పటికే అధికారికంగా ఈనెల 22న సెలవు ప్రకటించారని, తెలంగాణ ప్రభుత్వం కూడా సెలవు ప్రకటించాలని విజ్ఞప్తి చేశారు. ఇందులో హిందూ సమాజం సభ్యులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఇంటింటికీ రాములోరి అక్షింతలు

సిరికొండ, జనవరి 20: సిరికొండలో శనివారం అయోధ్య రాములోరి అక్షింతలను ఇంటింటికీ పంపిణీ చేశారు. ముందుగా స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు చేసి, అక్కడి నుండి శివాలయం వరకు శోభాయాత్ర నిర్వహించారు. అనంతరం గ్రామస్తులు ఇంటింటికీ వెళ్లి అక్షింతలు అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ ఒరగంటి నర్మదా పెంటన్న, ఉపసర్పంచ్ తోకల చందు, లక్కం మల్లేష్ యాదవ్, గంగాధర్, అశోక్, గ్రామస్థులు పాల్గొన్నారు.

'పథకాలను సద్వినియోగం చేసుకోవాలి'

గుడిహత్నూర్, జనవరి 20: పేదల సంక్షేమం కోసం కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీ సోయం బాపూరావు అన్నారు. శనివారం మండలంలోని గర్కంపేట్‌లో నిర్వహించిన వికసిత్ సంకల్ప యాత్ర కార్యక్రమంలో ఎంపీ పాల్గొన్నారు. అనంతరం మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేద కుటుంబాలకు భరోసా ఇస్తాయని తెలిపారు. భారత్‌ను అభివృద్ధి చెందిన దేశంగా తీర్చిదిద్దడమే ప్రధాని మోదీ సంకల్పమని పేర్కొన్నారు. అర్హులందరికీ పథకాలు అందించాలన్న ఉద్దేశంతోనే వికసిత్ సంకల్ప యాత్ర చేపట్టినట్లు తెలిపారు. ఆ తర్వాత కేవీకే అధికారులు డ్రోన్ టెక్నాలజీ ఉపయోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పతంగే బ్రాహ్మనంద్, సర్పంచ్ పర్చకి నీలా దేవి, కేవీకే అధికారులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

'ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలి'

తలమడుగు, జనవరి 20: ప్రతీఒక్కరు ఆధ్యాత్మిక మార్గంలో నడుచుకోవాలని ఆధ్యాత్మిక తతోని మానసిక ప్రశాంతత లభిస్తుందని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ కోరారు. శనివారం తలమడుగు మండలంలోని బరంపూర్ కొండపై వెలసిన శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. అనంతరం భక్తులకు జిల్లా పంచా యతీ అధికారి శ్రీనివాస్ భారీ ఎత్తున అన్నదానం నిర్వహించారు. ఇందులో ఎంపీఈవో దిలీప్‌కుమార్, సర్పంచ్ భగీరథ బాయ్, పంచాయతీ సెక్రటరీ అనిల్‌రెడ్డి, ఆలయకమిటీ అధ్యక్షులు కేదరేశ్వర్‌రెడ్డి, కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలు

- రాష్ట్రస్థాయి ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌ను దక్కించుకున్న సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థులు
- విజేతలకు బహుమతులను అందజేసిన పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు

ఉట్నూర్, జనవరి 20: గత నాలుగు రోజులుగా మండలకేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఇంటర్ సొసైటీ లీగ్ పోటీలు ప్రశాంతంగా ముగిశాయి. ఉట్నూర్ ఐటీడీఏ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన రాష్ట్రస్థాయి ఐఎస్ఎల్ పోటీలకు తెలంగాణ రాష్ట్రంలోని ఏడు సొసైటీల విద్యా సంస్థలలో చదువుకుంటున్న 3500 మంది విద్యార్థులు, 1500 మంది సిబ్బంది పాల్గొని నిర్వహించిన క్రీడా పోటీలు ఆహ్లాదంగా ముగిశాయి. శనివారం జరిగిన అండర్-17 ఫైనల్ వాలీబాల్ పోటీలు పోటాపోటీగా జరిగాయి. కంటోన్మెంట్ జనరల్ గురుకుల విద్యా సంస్థల బాలికలకు, బాలానగర్ గురుకులం బాలికలకు మధ్య జరిగిన హోరాహోరీ పోరులో బాలానగర్ బాలికలు విజయం సాధించారు. ఇదే మాదిరి సాంఘిక సంక్షేమ శాఖ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్‌ను కైవసం చేసుకున్నారు. 14ఏళ్ల బాలురలో అథ్లెటిక్స్‌లో సోషల్ వెల్ఫేర్ విద్యార్థి ప్రవీణ్ ఉత్తమ క్రీడాకారుడిగా, 17 ఏళ్ల బాలుర అథ్లెటిక్స్ పోటీలలో జనరల్ గురుకులం విద్యార్థి రాజేశ్ ఉత్తమ క్రీడాకారుడుగా, 14ఏళ్ల బాలికల పోటీలలో సోషల్ వెల్ఫేర్ విద్యార్థిని చిన్నుబాయి ఉత్తమ క్రీడాకారిణిగా, 17 ఏళ్ల బాలికల పోటీలలో ఆదిలాబాద్ స్టార్ విద్యార్థిని అంజలి ఉత్తమ క్రీడాకారిణిగా, అర్చరీలో చాంపియన్‌గా స్టార్ ఆదిలాబాద్ నిలువగా, రెండవ స్థానంలో మహాత్మా జ్యోతిబాపూలే విద్యా సంస్థలు నిలిచాయి. అథ్లెటిక్స్ 14 ఏళ్ల విభాగంలో ఆదిలాబాద్ స్టార్ చాంపియన్‌షిప్ అందుకోగా, 17ఏళ్ల విభాగంలో మహాత్మా జ్యోతిబాపూలే విద్యా సంస్థలు, 19 విభాగంలో తెలంగాణ మైనార్టీస్ విద్యా సంస్థలు చాంపియన్‌షిప్ అందుకున్నాయి.

● జాతీయ స్థాయిలో ఎదగాలి : ఎమ్మెల్యే బొజ్జుపటేల్



నాలుగు రోజులుగా జరిగిన ఐఎస్ఎల్ పోటీల ముగింపు కార్యక్రమానికి హాజరైన ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్ మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి సొసైటీ క్రీడలలో విజయం సాధించిన విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడాకారులుగా ఎదగాలని ఆకాంక్షించారు. ప్రశాంత వాతావరణంలో నాలుగు రోజుల పాటు జరిగిన క్రీడల కోసం శ్రమించిన వారందరిని అభినందించారు. ఓటమికి గురైన వారు రాబోయే రోజుల్లో విజయం సాధించడానికి ప్రయత్నించాలన్నారు. రాష్ట్ర స్థాయి నుంచి జాతీయ స్థాయి క్రీడాకారులను తయారు చేసే విధంగా రాష్ట్ర ప్రభుత్వం అన్నిరకాల ప్రోత్సాహకాలు అందిస్తోందని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు.



వాలీబాల్ ఫైనల్ మ్యాచ్‌లో విజయం సాధించిన బాలనగర్ బాలికలు



ఛాంపియన్‌షిప్‌ను అందుకుంటున్న క్రీడాకారులు, అదనపు సెక్రెటరీ

● ప్రతీ జిల్లాలో క్రీడలు ఏర్పాటు చేయాలి : ఎమ్మెల్యే కోవ లక్ష్మి

ఉట్నూర్‌లో ఏర్పాటు చేసినట్లుగా ప్రతి జిల్లాలో రాష్ట్రస్థాయి క్రీడలు ఏర్పాటుచేసి క్రీడాకారులను ప్రోత్సహించాలని ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి అన్నారు. చదువుతో పాటు విద్యార్థులు క్రీడల్లో రాణించాలని అన్నారు. ఆదిలాబాద్ జిల్లా వెనుకబడలేదని అన్ని రంగాల్లో ముందుకు దూసుకు వెళ్తుందని అన్నారు. క్రీడలతో పాటు సాంస్కృతి కార్యక్రమాలతో విద్యార్థులు ముందుకు వెళ్లాలని ఆమె పేర్కొన్నారు.

● క్రీడాస్ఫూర్తి పెంచుకోవాలి : ఎమ్మెల్సీ దండె విఠల్

ప్రతీ విద్యార్థి క్రీడాస్ఫూర్తి పెంచుకొని ఆటల్లో రాణించాలని ఉమ్మడి జిల్లా మండలి సభ్యులు దండె విఠల్ అన్నారు. క్రీడలు ఆడడం ద్వారా మానసిక ఉల్లాసంతో పాటు శారీరధారుడ్యం పెరుగుతుందన్నారు. చెడు వ్యసనాలకు దూరంగా ఉండి, చెడు వైపు తొంగి చూస్తున్న సాటి మిత్రులను మంచిమార్గంలో పెట్టేలా యువత కృషి చేయాల్సిన అవసరం ఉందన్నారు.

● మధురస్మృతులను మరిచిపోవద్దు : పీవో

గత నాలుగు రోజులుగా ఉట్నూర్ కొమురంభీం ప్రాంగణంలో నిర్వహిస్తున్న ఐఎస్ఎల్‌లో మధుర స్మృతులను మరిచి పోవద్దని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్‌బాజ్‌పాయి అన్నారు. క్రీడాకారులను ఎలాంటి అసౌకర్యం లేకుండా క్రీడలు నిర్వహించడం జరిగిందని, ఎక్కడైనా చిన్న పొరపాట్లు జరిగితే క్షమించాలన్నారు. గెలిచిన వారు సంతోషించినట్లే, ఓడిన వారు కూడా రేపటి గెలుపు కోసం ప్రయత్నం చేయాలన్నారు. జిల్లా క్రీడల అధికారి పార్థసారధితో పాటు నిర్మల్ మంచిర్యాల ఆసిఫాబాద్‌జిల్లాల క్రీడా అధికారులు భుక్య రమేష్, బండ జీవరత్నం, మీనారెడ్డిలతో పాటు ఆదర్శ క్రీడా పాఠశాలల, ఆశ్రమ పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు, రాష్ట్రంలోని సొసైటీల నుంచి వచ్చిన వ్యాయామ ఉపాధ్యాయులు సైతం శ్రమించి సొసైటీ లీగ్ పోటీలను విజయవంతం చేశారన్నారు. ఆలస్యంగా సభా ప్రాంగణానికి చేరుకున్న సంక్షేమ శాఖ అడిషనల్ సెక్రటరీ హనుమంతు నాయక్ విజేతలకు బహుమతులు పంపిణీ చేయడంతో పాటు సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకోవడంతో పాటు సోషల్ వెల్ఫేర్ విద్యార్థులు ఓవరాల్ చాంపియన్‌షిప్ దక్కించుకోవడంతో వారితో కలిసి నృత్యాలు చేశారు. విజేతలకు బహుమతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కలెక్టర్ వికాస్‌మహతో, డీడీ దిలీప్‌కుమార్, రమాదేవి, డీటీడీవోలు మడావి గంగారాం, జాదవ్ అంబాజి, ఎంపీపీ పంద్ర జైవంతరావు, వైస్ ఎంపీపీ దావులే బాలాజి, మహిళ కమిషన్‌సభ్యురాలు కుంర ఈశ్వరీబాయి, పీవీటీజీ ఏపీవో ఆత్రం భాస్కర్, హెచ్ఎంలు గోడం చందన్, జాదవ్‌ఉత్తం, మడావి కృష్ణారావు, జాదవ్ హేమంత్‌నాయక్, ధరణిరాజేశ్, సర్పంచ్ మల్లికా, తదితరులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం మధ్యాహ్న భోజనాన్ని అందించాలి

● తహసీల్దార్ రాజమోహన్

తలమడుగు, జనవరి 20: పాఠశాల విద్యార్థులకు పౌష్టికాహారం అందించేందుకు పాఠశాలలో అమలు చేస్తున్న మధ్యాహ్న భోజనాన్ని మెనూ ప్రకారం అందించాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. శనివారం మండలంలోని శంకరి ప్రాథమిక పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ విద్యార్థులకు నాణ్యమైన భోజనాన్ని అందించాలన్నారు. అంతేకాకుండా ప్రభుత్వం అందించిన మెను ప్రకారం విద్యార్థులకు భోజనాన్ని అందించాలని సూచించారు. మెను పాటించకుంటే శాఖపరమైన చర్యలు తప్పవన్నారు. కాగా సుంకిడి పాఠశాలలో విద్యార్థులకు కిచిడి పెట్టడంతో విద్యార్థుల తల్లిదండ్రులు తహసీల్దార్‌కు విన్నవించారు. సాంబారు లేకుండా కిచిడితో విద్యార్థులకు అన్నం తినడం లేదన్నారు. ఇందులో పాఠశాల ఉపాధ్యాయులు గ్రామస్థులు తదితరులు పాల్గొన్నారు.

● 'ప్రతీఒక్కరు ఓటు హక్కు కలిగి ఉండాలి'

తలమడుగు: భారత రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతి ఒక్కరు కలిగి ఉండాలని తహసీల్దార్ రాజమోహన్ కోరారు. రాష్ట్ర ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శనివారం ఆదివారం రెండు రోజుల పాటు ప్రత్యేకై ఓటు హక్కు నమోదు కేంద్రాలను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి గ్రామంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఓటరు నమోదు కేంద్రంలో 18 సంవత్సరాల నుంచి ప్రతి ఒక్కరు సంబంధిత పత్రాలతో ఓటు హక్కు కోసం నమోదు చేసుకోవాలని సూచించారు.



సుంకిడి పాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్

రైల్వే సాధన కమిటీ దీక్షలకు సీపీఎం మద్దతు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 20: ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేస్తూ రైల్వే లైన్ సాధన కమిటీ చేస్తున్న రిలే నిరాహార దీక్షలకు సీపీఎం పార్టీ, ప్రజా సంఘాలు దీక్ష శిబిరాన్ని సందర్శించి సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా సీపీఎం జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లాను అభివృద్ధి చేయడానికి అన్ని వనరులు ఉన్నప్పటికి అల్లుని నోట్లో శని అన్నట్లుగా పాలకుల నిర్లక్ష్యం ఫలితంగా వెనుకబడిపోయిందన్నారు. ఆదిలాబాద్ నుంచి ఆర్మూర్ వరకు రైల్వేలైన్ మంజూరు చేస్తే రవాణా సౌకర్యంతో పాటు జిల్లా అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించే అవకాశం ఉందని తెలపారు. బీజేపీని ఇక్కడి ప్రజలు ఆధరించారని, ఎంపీతో పాటు ఆదిలాబాద్, నిర్మల్ ఆర్మూర్, కామారెడ్డి వరకు బీజేపీ ఎమ్మెల్యేలను గెలిపించారని పేర్కొన్నారు. రైల్వేలైన్ మంజూరు చేసి ప్రజల రుణం తీర్చుకోవాలని, మార్చిలో బడ్జెట్ సమావేశాల్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో ప్రజల వ్యతిరేకతను చూడాల్సి వస్తుందని హెచ్చరించారు. ఇందులో పార్టీ నాయకులు లంక రాఘవులు, బండి దత్తాత్రి, సీఐటీయూ రాష్ట్ర నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 10 మందికి గాయాలు

● నిర్మల్ జిల్లా సారంగాపూర్‌లో ఘటన



సారంగాపూర్, జనవరి 20 : నిర్మల్ జిల్లా సారంగపూర్ మండలంలో శనివారం వీధి కుక్కలు దాడి చేసి 10మందిని గాయపరిచాయి. సారంగాపూర్‌లో సాయంత్రం వేళ రోడ్డుపై వెళుతున్న ఎనిమిది మందిపై దాడి చేశాయి. అలాగే అడెల్లి గ్రామంలో కుక్కల గుంపు ఇద్దరి బాలురిపై దాడి చేసి గాయపరిచాయి. గాయాలైన వారిని స్థానికులు చికిత్స నిమిత్తం వెంటనే సారంగాపూర్ ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మహిళలు సైనికుల్లా ఎదగాలి : కలెక్టర్

ఆసిఫాబాద్, జనవరి 20 : బాలికలు, మహిళలు, ఉద్యోగినులు ఎలాంటి పరిణామాలనైనా ఎదుర్కొనేందుకు సైనికుల్లా ఎదగాలని కలెక్టర్ హేమంత్ బొర్కడే అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బాలికలు, మహిళలు ఎదుర్కొంటున్న లైంగిక వేధింపులపై నిర్వహించిన స్మార్ట్‌యోదా మహిళా స్వశక్తి కార్యక్రమంలో ఆదిలాబాద్ మహిళాస్వశక్తి సమన్వయకర్త మాధవితో కలిసి అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ బాలికలు, విద్యార్థినులు, ఉద్యోగినులు, మహిళలు తమ నిత్యజీవితంలో ఎన్నోరకమైన వేధింపులకు, దాడు లకు గురవుతున్నారని అన్నారు. ప్రతి బాలిక, విద్యార్థిని, ఉద్యోగిని, మహిళ గుండె నిబ్బరంతో ఉండి ఎలాంటి పరిణామాలనైనా మనోధైర్యంతో ఎదుర్కొనే విధంగా సన్నద్ధమవ్వాలన్నారు. ప్రతిమహిళా ఓసైనికురాలిగా ఎదగాలన్నారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారిణి సావిత్రి, డీఈవో అశోక్, ఉద్యోగులు, షీ టీం సభ్యులు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఇంటి పన్నులు వసూలు చేయాలి

● ముథోల్ డివిజనల్ పంచాయతీ అధికారి శివకృష్ణ

ముథోల్, జనవరి 20 : మండలంలోని ఆయా గ్రామ పంచాయతీల పంచాయతీ కార్యదర్శులు జనవరి 31 తేదీ వరకు ఇంటి పన్ను వసూలు చేయాలని డీఎల్‌పీవో శివకృష్ణ అన్నారు. మండల కేంద్రమైన ముథోల్‌లోని మండలాభివృద్ధి కార్యాలయంలో శనివారం ముథోల్, బాసర, తానూర్ మండలానికి చెందిన పంచాయతీ కార్యదర్శులు, ఎంపీవోలతో జీపీ డీపీపై సమావేశానికి నిర్వహించారు. అలాగే గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికను ఈ నెల 31 తేదీలోపు పకడ్బందీగా తయారు చేయాలని సూచించారు. అలాగే గ్రామాల్లో పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. పచ్చదనం, పరిశుభ్రత పెంపొందించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. ప్రతి పంచాయతీ కార్యదర్శి ఉదయం 9 గంటలలోపే డీఎస్ఆర్ అటెండెన్స్ చేయాలని పేర్కొన్నారు. ప్రణాళికబద్ధంగా అభివృద్ధి ప్రణాళిక తయారు చేసి సమర్పించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీవోలు అమీర్‌ఖాన్, మన్మోహన్‌శాస్త్రి, మోహన్‌శాస్త్రి, మూడు మండలాల పంచాయతీ కార్యదర్శులు, తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో డీఎల్‌పీవో మాట్లాడుతున్న దృశ్యం

ఆవుకు అంత్యక్రియలు

బెజ్జూరు, జనవరి 20: మానవత్వం మరిచి పోయి తల్లి దండ్రులకు అంత్యక్రియలు నిర్వహించని ఈ రోజుల్లో ఓ పురోహితుడు మృతిచెందిన ఆవుకు అంత్యక్రియలు నిర్వహించాడు. బెజ్జూరు మండలకేంద్రానికి చెందిన ఎరోజు సత్యనారాయణచారి అనే పురోహితుడు తాను సాదుకున్న ఆవు మరణించడంతో కన్నీటి పర్యంతమ య్యాడు. మృతిచెందిన ఆవును మనుషుల లాగానే పాడే కట్టించి డప్పులతో తీసుకెళ్లి భూమిలో పాతిపెట్టి గోమాతకు అంత్యక్రియలు నిర్వహించాడు.

కలెక్టర్‌కు అయోధ్య అక్షింతల పంపిణీ

ఆసిఫాబాద్, జనవరి 20: శ్రీరామ జన్మభూమి తీర్థ క్షేత్ర మండలకమిటీ సభ్యులు శనివారం కలెక్టర్ హేమంత్ బోర్కడే, ఎమ్మెల్యే కోవలక్ష్మి, ఎమ్మెల్సీ దండే విఠల్, జడ్పీటీసీ అరిగెల నాగేశ్వర్‌రావు, జిల్లా అధికారులకు అయోధ్య అక్షింతలు, ఫొటోలు పంపిణీ చేశారు. ఈనెల 22న జన్కాపూర్ కోదండ రామాలయంలో జరిగే పుజాకార్యక్రమంలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో సంయోజక్ ఆంజనేయులు, వెంకటేశ్వర్లు, వేణుగోపాల్, కోటేశ్వర్‌రావు, రాజేశ్వర్, శ్రీనివాస్, జి.శ్రీనివాస్, శ్రీకాంత్, శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేచే పాఠశాల పత్రిక ఆవిష్కరణ



పత్రికను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే రామారావు పటేల్

బాసర, జనవరి, 20: జడ్పీఎస్ఎస్ కౌట పాఠశాలలో విద్యార్థులు తయారు చేసిన పత్రికను శనివారం ముథోల్ ఎమ్మెల్యే రామారావుపటేల్ ఆవిష్కరించారు. ఈ పాఠశాల మ్యాగజైన్‌ను పాఠశాలలోని హిందీ ఉపాధ్యాయులు శ్రీ యోగేశ్వర్‌రావు దేశ్‌ముఖ్ 8వ తరగతి విద్యార్థులచే రూపొందింపజేయడంతో ఆయనను ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యార్థులకు చదువుతో పాటు ఇలాంటి సృజనాత్మక కార్యక్రమాలు వారి అభివృద్ధికి ఎంతగానో ఉపయోగపడుతాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజయ్య, ఉపాధ్యాయులు, విద్యార్థులు, వివిధ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.



పడిపోయిన పత్తి ధర

ఎన్నో ఆశలతో సాగుకు శ్రీకారం చుట్టిన అన్నదాతలకు కాలం కలిసి రాకపోవడంతో నష్టాలే మిగిలుతున్నాయి. ఎన్నో కష్టాలతో చేసిన సాగుకు ఫలితం అందక తీరని వెదకు గురవుతున్నారు. అసలే దిగుబడి లేక నష్టాలను చవి చూస్తున్నరైతులకు పత్తిధర పడిపోవడం జీర్ణించుకోలేక పోతున్నారు. సాగుకోసం వేల రూపాయలు అప్పు తెచ్చి మరీ పెట్టుబడి పెట్టగా కనీసం పెట్టుబడులు కూడా రాలేని పరిస్థితి నెలకొంది.

- తగ్గిన దిగుబడి
- రైతులకు కలిసి రాని కాలం
- సరైన సమయంలో వర్షాలు లేక దిగుబడిపై ప్రభావం
- అప్పుల్లో కూరుకుపోతున్న అన్నదాతలు

బెజ్జూరు, జనవరి 20: జిల్లాలో అధికంగా రైతులు వాణిజ్యపంటైన పత్తి వైపు మొగ్గు చూపి సాగు చేశారు. ఈ ఏడాది సమయానికి అనుకూలంగా వర్షాలు లేక పత్తి దిగుబడి పూర్తిగా తగ్గింది. ఉత్పత్తి తగ్గడంతో డిమాండ్ పెరగి ధర పలుకుతుందనుకున్న రైతుల ఆశలు నెరవేరలేదు. సాగుకు ఒక్కో ఎకరానికి సుమారు 25నుంచి 30 వేల వరకు ఖర్చు చేయగా కనీసం పెట్టిన పెట్టుబడులు కూడా రాని పరిస్థితి తలెత్తడంతో అన్నదాతలు దిగులు చెందుతున్నారు.

పత్తి పంట చేతికొచ్చే దశలో ఒక్క వర్షం కూడా కురవని కారణంగా దిగుబడి అమాంతం తగ్గింది. తొలకరి ఆరంభంలో వర్షాలు ఆలస్యం కావడం.. దీనికి తోడు సాగు వెనక్కి వెళ్లడం ఆ తర్వాత సరైన సమయంలో వర్షాలు లేక ఆశించిన స్థాయిలో కాత కాయకపోవడంతో దిగుబడి అమాంతం తగ్గింది.

వర్షాలు లేక తగ్గిన దిగుబడి..

జిల్లాలో ఈ ఏడాది 3.35లక్షల ఎకరాల్లో పత్తి సాగు చేసినట్లు వ్యవసాయశాఖ అధికారులు గుర్తించారు. పత్తి పంట చేతికొచ్చే సమయంలో వర్షాలు కురవలేదు. దీనికి తోడు పత్తికి తెగుళ్ల ఇతర సమస్యలు రావడంతో రైతులు ఆశించిన మేర దిగుబడి రాలేదు. పెట్టిన పెట్టుబడులకు వచ్చిన దిగుబడికి వ్యత్యాసం చూస్తే కనీసం సాగు కోసం చేసిన పెట్టుబడులు కూడా రాలేదని రైతులు ఆందోళన చెందుతున్నారు.

పెరిగిన కూలీల రేట్లు..

ప్రస్తుతం పత్తి పంట ఏరివేత సీజన్ కావడంతో రైతులకు కూలీలు కూడా దొరకని పరిస్థితి నెలకొంది. పత్తి ఏరేందుకు ప్రస్తుతం జిల్లాలో కిలోకు రూ.10నుంచి 15 ఇస్తున్నా కూలీల కొరత వేధిస్తోంది, అసలే పత్తి దిగుబడి లేక సతమతం అవుతుంటే కూలీరేట్లు పెరగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు.

పత్తి ఏరేందుకు ఇతర ప్రాంతాల నుంచి కూలీలను తీసుకురావాల్సిన పరిస్థితులు తలెత్తుతున్నాయి. ప్రస్తుతం పత్తి ఏరివేత చివరి దశకు చేరడంతో కూలీల కొరత వేధిస్తోంది.

మొన్నటి వరకు మధ్యప్రదేశ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి కూలీలు ఇక్కడ పత్తి ఏరేందుకు వలస వచ్చారు. కాగా కూలీరేట్లు అధికంగా పెరగడం, ఈ ఏడాది పత్తికి ఆశించినస్థాయిలో ధర లేక రైతులు ఆం దోళన చెందుతున్నారు. ప్రస్తుతం పత్తి క్వింటాకు రూ.6500మాత్రమే లభిస్తోంది. దీనికి తోడు పత్తి దిగుబడి కూడా తగ్గడంతో సాగుకు చేసిన ఖర్చులు కూడా రాని పరిస్థితులు ఉన్నాయని రైతులు ఆందో ళన చెందుతున్నారు. మరోవైపు కూలీలు దొరక్క చేలల్లోనే పత్తి ఉండిపోతోందని రైతులు వాపోతున్నారు.

అప్పులు మిగిలాయి..

: సెడ్మెక గుండయ్య, హేటిగూడ



నాకున్న మూడెకరాల వ్యవసాయ చేనులో పత్తి సాగు చేశాను. ఈ ఏడాదిసరైన వర్షాలు లేని కారణంగా పత్తి పంట దిగుబడి తగ్గింది. దీంతో పత్తి పంట సాగుకు చేసిన పెట్టుబడులు కూడా రాలేదు. ప్రభుత్వం స్పందించి మమ్మల్ని ఆదుకోవాలి.

ప్రభుత్వం ఆదుకోవాలి..

: కావుడే నందయ్య, నాగులవాయి



పత్తి పంట సాగు చేసి తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలి. ఏటా కురుస్తున్న భారీ వర్షాల కారణంగా నజ ష్టపోతున్న మాకు ప్రభుత్వం ఎలాంటి సాయం చేయడం లేదు.

కాగజ్‌నగర్ మున్సిపల్ ఛైర్మన్‌పై నెగ్గిన అవిశ్వాసం



కౌన్సిలర్లను సన్మానించిన కోనేరు కోనప్ప

కాగజ్‌నగర్, జనవరి 20: కాగజ్‌నగర్ మున్సిపల్‌ఛైర్మన్ సద్దాం హుస్సేన్‌పై పెట్టిన అవిశ్వాసతీర్మానం శనివారం నెగ్గిం ది. కాగజ్‌నగర్ మున్సిపాలిటీలో ఉదయం 11.30గంటలకు ఆర్డీవో సురేష్ ఆధ్వర్యంలో అవిశ్వాస తీర్మాన సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశానికి మున్సిపాలిటీకి చెందిన 23మందికౌన్సిలర్లు హాజరయ్యారు. మున్సిపాలిటీలో 30మంది కౌన్సిలర్లు ఉండగా, 2/3వంతు కౌన్సిలర్లు అవిశ్వాస తీర్మానానికి అనుకూలంగా చేతులెత్తారు. దీంతో మున్సిపల్ ఛైర్మన్‌పై పెట్టిన అవిశ్వాస తీర్మానం నెగ్గినట్టు ఆర్డీవో సురేష్ ప్రకటించారు. అవిశ్వాసం నెగ్గిన అంశాలను రాష్ట్ర ప్రభుత్వానికి పంపించనున్నట్టు తెలిపారు.

అంతటా టెన్షన్..


మున్సిపల్ కార్యాలయంలో ఛైర్మన్‌సద్దాంహుస్సేన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రవేశపెడుతుండటంతో పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటుచేశారు. గుర్తింపు కార్డులున్నవారిని మాత్రమే లోనికి అను మతించారు. ఉదయం 11.30గంటలకు పాలకవర్గ కౌన్సిలర్లు, మున్సిపల్ ఛైర్మన్ సద్దాం హుస్సెన్ అనుచరులు వచ్చారు. మాజీ మున్సిపల్ ఛైర్మన్ దస్తగిర్ అనుచరులతో కాసేపు వాగ్వాదాం జరిగింది. అక్కడే ఉన్న పోలీసులు ఇరువర్గాలను చెదరగొట్టారు. అనంతరం కౌన్సిలర్లందరినీ తనిఖీ చేసి లోనికి పంపించారు. ఉదయంనుంచి 11.30 గంటల వరకు కౌన్సిలర్లు చేతులెత్తుతారా..? లేదా అనే టెన్షన్ ఇరువర్గాల్లో నెలకొంది. మున్సిపల్ ఛైర్మన్ సద్దాంహుస్సేన్, మాజీ ఎమ్మెల్యే కోనప్పమధ్య ఏర్పడినవిబేధాలు అవిశ్వాసంవరకు వచ్చింది.మాజీ ఎమ్మె ల్యే కోనప్పవర్గం ఎలాగైనా అవిశ్వాసం నెగ్గించుకోవాలని ఉద్దేశ్యంతో పావులు కదిపి ఎట్టకేలకు విజయం సాధించింది. అనంతరంమున్సిపల్ కార్యాలయం ఎదు ట సంబరాలు జరుపుకున్నారు. కార్యాలయం ఎదుట డ్యాన్సు లు చేశారు. పట్టణ వీధుల గుండా ర్యాలీ నిర్వహించి మాజీఎమ్మెల్యే కోనప్ప నివాసానికి చేరుకొన్నారు. మద్దతు పలికిన కౌన్సిలర్లకు కోనప్ప శాలువాతో సన్మానించారు.

andhrajyothy.com
శనివారం ఉష్ణోగ్రత గరిష్ఠం 30.8, కనిష్ఠం 18.2

ఆదిలాబాద్
జిల్లా వార్తలు

5

ఆదివారం 21 జనవరి 2024



'రేపు పాఠశాలలకు సెలవు ప్రకటించాలి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 20: అయోధ్య రామాలయ విగ్రహ ప్రతిష్ఠాపన నేపథ్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు ఈనెల 22న సెలవు ప్రకటించాలని టీజీవీపీ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర అర్గనైజ్ సెక్రెటరీ కొట్టూరి ప్రవీణ్ అన్నారు. జిల్లాకేంద్రంలో ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈనెల 22న ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన అయోధ్య రామాలయ ప్రతిష్ఠాపనకు ఉమ్మడి జిల్లావ్యాప్తంగా అన్ని పాఠశాలలకు సెలవు ప్రకటించాలని కోరారు. ఇందులో సాయి, రాము, అజయ్, గణేష్, తదితరులు పాల్గొన్నారు.



● గతంలో దళితబంధు పథకం కింద పంపిణీ చేసిన వాహనాలు(ఫైల్)

దళితబంధుపై.. సందిగ్ధం!

- జిల్లాలో మొదటి దశకే పరిమితమైన దళితబంధు పథకం
- ప్రశ్నార్థకంగా పథకం అమలు తీరు
- గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో భారీగా వసూళ్ల దందా
- మొదటి విడతలో నియోజకవర్గానికి వంద చొప్పున మొత్తం 249 యూనిట్లు
- రెండో విడతలో సెగ్మెంట్‌కు 1100 యూనిట్ల టార్గెట్‌తో ప్రత్యేక జీవోను జారీ చేసిన గత ప్రభుత్వం
- అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అర్ధాంతరంగా నిలిపివేత
- ప్రస్తుతం పథకం ఎత్తివేసే దిశగా రాష్ట్ర ప్రభుత్వ అడుగులు?
- ఈనెల 28, 29న జిల్లా అధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి సమీక్షా సమావేశం
- జిల్లావ్యాప్తంగా లబ్ధిదారులకు తప్పని ఎదురుచూపులు

ఆదిలాబాద్, జనవరి 20 (ఆంధ్రజ్యోతి): దళితుల సంక్షేమం కోసం గత ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన దళితబంధు పథకంపై సందిగ్ధం నెలకొంది. అసలు ఈ పథకాన్ని కొనసాగిస్తారా? లేదా ఎత్తివేస్తారా? అనేది ప్రశ్నార్థకంగా మారింది. ఇప్పటికే రెండవ విడత జాబితాపై ఎన్నో ఆశలు పెట్టుకున్న లబ్ధిదారులు ఎంతో ఆశగా ఎదురు చూస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు అధికారులు కొంత హడావుడి చేసినా.. ఆ తర్వాత దళితబంధుపై ఊసేత్తడమే లేదు. మొదటి విడతలో నియోజకవర్గానికి వంద చొప్పున జిల్లాకు 249 యూనిట్లను మంజూరు చేసిన ప్రభుత్వం.. రెండో విడతలో నియోజకవర్గానికి 1,100 యూనిట్ల టార్గెట్‌తో ప్రత్యేక జీవోను జారీ చేసింది. ఆ తర్వాత ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో పథక అమలును అర్ధాంతరంగానే నిలిపివేశారు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి రావడంతో పథక అమలుపై పలు రకాల అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. పథకాన్ని యధావిధిగా కొనసాగించాలని అధికారులకు దళిత సంఘాల నేతలు వినతి పత్రాలను అందించారు. అయినా పథకం అమలుపై ప్రభుత్వం స్పష్టతనివ్వక పోవడంతో దళితులకు ఎదురుచూపులు తప్పడం లేదు. అయితే ఈ నెల 28, 29వ తేదీలలో జిల్లా దళిత అభివృద్ధి శాఖ అధికారులతో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సమీక్ష సమావేశం నిర్వహించే అవకాశం ఉందంటున్నారు. ఆ తర్వాతనే దళితబంధు పథకం అమలుపై స్పష్టత వస్తుందని జిల్లా అధికారులు పేర్కొంటున్నారు.

ఆశకు పోతే అసలుకే మోసం

దళితబంధు పథకం మంజూరు చేయిస్తామని కొంతమంది బీఆర్ఎస్ నేతలు లబ్ధిదారుల నుంచి వసూలు దందాకు ఎగబడడంతో అమాయక దళితులకు అసలుకే మోసం వచ్చింది. ఒక్కో లబ్ధిదారు నుంచి రూ.2లక్షల నుంచి రూ.3లక్షల వరకు వసూలు చేసినట్లు తెలుస్తుంది. ఎలాంటి అర్హత, ఆంక్షలు లేకుండానే గత ప్రభుత్వం ప్రతీ దళిత కుటుంబానికి రూ.10లక్షల నిధులను అందించి ఆర్థికపరమైన సహకారాన్ని అందించాలని నిర్ణయించింది. కానీ దళిత కుటుంబాల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొందరు.. మండల, గ్రామస్థాయి నేతలు అందినకాడికి దండుకున్నారనే ఆరోపణలు వస్తున్నాయి. బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి రాకపోవడంతో అప్రమత్తమైన లబ్ధిదారులు ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలంటూ నేతల చుట్టూ తిరుగుతున్నట్లు తెలుస్తుంది. ఇప్పటికే కొంత మందికి డబ్బులు తిరిగి ఇచ్చిన నేతలు.. మరికొంత మంది లబ్ధిదారులను ముప్పుతిప్పలు పెడుతున్నట్లు తెలుస్తుంది. కేవలం బోథ్ నియోజకవర్గంలోనే రూ.15 కోట్లకు పైగా వసూలు చేసినట్లు తెలుస్తుంది. గత ఆరు మాసాలుగా ఇదిగో.. అదిగో.. అంటూ కాలం గడుపుతూ వస్తున్నారని లబ్ధిదారులు వాపోతున్నారు. పథకం మంజూరుకాకపోయిన ఫర్వాలేదు కానీ, ఇచ్చిన డబ్బులు తిరిగి ఇస్తే చాలు అనే ఉద్దేశంతో లబ్ధిదారులు ఉన్నట్లు తెలుస్తుంది. గతంలో ఓ అగ్ర నేతకు ఇచ్చిన డబ్బుల విషయంలో ఇటీవలే సెటిల్‌మెంట్ కూడా జరిగి పోయినట్లు తెలుస్తుంది. తిరిగి డబ్బులు ఇచ్చే పరిస్థితి లేక మండల, గ్రామస్థాయి నేతలకు తన సొంత ప్లాట్లను రిజిస్ట్రేషన్ చేసి ఇచ్చినట్లు సమాచారం. అయితే అసలైన లబ్ధిదారులకు డబ్బులు తిరిగి ఇచ్చేందుకు కొంత మంది స్థానిక నేతలు ఇబ్బందులకు గురి చేస్తున్నట్లు తెలిసింది.

అమలు చేస్తారా? ఎత్తివేస్తారా?

గత ప్రభుత్వ హయాంలో అమలు చేసిన దళితబంధు పథకాన్ని కొత్త ప్రభుత్వం ఎత్తివేసే దిశగా అడుగులు వేస్తున్నట్లు అధికారవర్గాల ద్వారా తెలుస్తుంది. త్వరలోనే జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించి పథక అమలుపై తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉందంటున్నారు. సరైన విధివిధానాలు లేకపోవడంతో దళితబంధు పథకంలో భారీ అవినీతి అక్రమాలు జరిగినట్లు గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వ పెద్దలే అంగీకరించారు. లబ్ధిదారుల ఎంపిక బాధ్యతను నియోజకవర్గ ఎమ్మెల్యేలకు అప్పగించడంతో.. పథక అమలు పక్కదారి పట్టింది. దీంతో గత ప్రభుత్వానికి లాభంకన్న.. నష్టమే ఎక్కువగా జరిగింది. ఇలాంటి విషయాలన్నింటినీ పరిగణలోకి తీసుకుని దళితబంధు విధివిధానాలను కొత్తగా రూపొందించే అవకాశం ఉంది. ఈ పథకం స్థానంలో దళితభరోసా పథకాన్ని అమలు చేసేందుకు ప్రభుత్వం ఆలోచిస్తున్నట్లు తెలుస్తుంది. మొదటి విడతలో వందల మందికే లబ్ధి చేకూరినా.. వేల మంది లబ్ధిదారులు ఈ పథకం అమలుపై ఎన్నో ఆశలు పెట్టుకున్నారు. పథకాన్ని అమలు చేయాలన్న డిమాండ్లు వినిపిస్తున్నాయి. కొత్తగా ఎన్నికైన ఎమ్మెల్యేలతో పాటు జిల్లా అధికారులకు దళిత కుటుంబాలు మొర పెట్టుకుంటున్నాయి.



దళితబంధును యధావిధిగా అమలు చేయాలి

: బొల్లారపు బాపన్న మాజీ జడ్పీటీసీ, తలమడుగు మండలం



దళితుల అభివృద్ధి కోసం గత ప్రభుత్వం ప్రవేశ పెట్టిన దళితబంధు పథకాన్ని ప్రభుత్వం అమలు చేసి దళితుల అభివృద్ధి కోసం పాటు పడాలి. గత ప్రభుత్వ హయాంలో జరిగిన అవినీతి అక్రమాలు చోటు చేసుకోకుండా పకడ్బందీ చర్యలు తీసుకోవాలి. దళితులను మరింత ఆర్థికంగా అభివృద్ధి పరిచేందుకు కృషి చేయాలి. దళితబంధు పథకం అమలుతో దళితుల్లో గల నిరుద్యోగ యువతీ, యువకులకు ఈ పథకం ఎంతగానో దోహద పడుతుంది.

పథకం అమలుపై ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది

: శంకర్, ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, ఆదిలాబాద్



దళితబంధు పథక అమలుపై రాష్ట్ర ప్రభుత్వం నుంచి స్పష్టత రావాల్సి ఉంది. జిల్లాకు మంజూరైన 249 యూనిట్లకు నిధులు కేటాయించడం జరిగింది. రెండవ విడత లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయలేదు. ఈ నెల 28, 29వ తేదీలలో పథక అమలుపై సమీక్ష ఉంటుందని తెలుస్తుంది. ఆ తర్వాతనే స్పష్టత వచ్చే అవకాశం ఉంది. ఏదైనా ప్రభుత్వ ఆదేశాల ప్రకారమే పథక అమలును చేపడుతాం.

సంక్షిప్త సమాచారం



మంత్రికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న భోజారెడ్డి

మంత్రి కలిసిన డీసీసీబీ చైర్మన్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 20: రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ సహకార, చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావును హైదరాబాద్‌లోని సచివాలయంలో ఆదిలాబాద్ డీసీసీబీ బ్యాంక్ చైర్మన్ అడ్డి భోజారెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జిల్లాలో రాజకీయ పరిస్థితులపై చర్చించారు. సహకార రుణాలు రైతులకు అందేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించినట్లు డీసీసీబీ చైర్మన్ తెలిపారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక

తాంసి, జనవరి 20: జిల్లాస్థాయిలో నిర్వహించిన విద్య వైజ్ఞానిక మేళకు తాంసి ఉన్నత పాఠశాల విద్యార్థి జి.కార్తీక్ రాష్ట్రస్థాయికి ఎంపికయ్యాడు. గత ఐదు రోజులుగా జిల్లాకేంద్రంలో నిర్వహించిన ఈ పోటీల్లో కార్తీక్ అత్యుత్తమ ప్రతిభ కనబరిచాడు. దీంతో విద్యార్థిని రాష్ట్రస్థాయి విద్య వైజ్ఞానిక పోటీలకు ఎంపిక చేశారు. ప్రభుత్వ పాఠశాల నుంచి ఎన్నికైన కార్తీక్‌ను ఉపాధ్యాయ బృందంతో పాటు విద్యార్థుల తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతం

ఉట్నూర్, జనవరి 20: ఉట్నూర్ మండల కేంద్రంలోని పూలాజిబాబా ఎక్సలెన్సి పాఠశాలలో శనివారం నిర్వహించిన నవోదయ ప్రవేశ పరీక్ష ప్రశాంతంగా జరిగింది. పూలాజిబాబా పరీక్ష కేంద్రంలో 267 మంది విద్యార్థులు హాజరు కావాల్సి ఉండగా 236 మంది పరీక్షలు రాశారు. మరో 31మంది విద్యార్థులు గైర్హాజరైనట్లు నవోదయ పరీక్షల ప్రత్యేక అధికారి అయిలయ్య యాదవ్ తెలిపారు. చీఫ్ సూపరింటెండెంట్‌గా తిరుపతి హాజరు కాగా, పరీక్షల కోసం 12 గదులను ఏర్పాటు చేసి 12 మంది ఇన్విజిలెటర్లను నియమించారు. మండలంలోని మండల విద్యాధికారితో అనుమతి తీసుకుని ఇద్దరేసి ఉపాధ్యాయులు ఉన్న పాఠశాలల నుంచి టీచర్లను ఇన్విజిలెటర్లుగా నియమించాల్సి ఉండగా ఏకోపాధ్యాయ పాఠశాలలకు చెందిన వారిని నియమించడంతో శనివారం పాఠశాలల్లో చదువులు సాగలేదు. దీనిపై చర్యలు తీసుకోవాలని గిరిజన సంఘాల నాయకులు కోరుతున్నారు.

'ఆలయాలను శుభ్రం చేయాలి'

గుడిహత్నూర్, జనవరి 20: ఈనెల 22న అయోధ్యలో శ్రీరాముని విగ్రహ ప్రతిష్ఠాపన సందర్భంగా దేశ ప్రధాని మోదీ పిలుపు మేరకు ప్రతిఒక్కరూ దేవాలయాలను పరిశుభ్రం చేయాలని బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి డా.కేంద్రే లక్ష్మణ్ అన్నారు. శనివారం మండలకేంద్రంలోని పురాతన శివాలయం, హనుమాన్ ఆలయంలో బీజేపీ నాయకులు శుభ్రం చేశారు. సోమవారం మండలంలోని ప్రతీ ఆలయాల్లో శుభ్రం చేసి హనుమాన్ చాలీసా, భజన కీర్తనలు చేయాలని పిలుపునిచ్చారు. ఇందులో ఆలయ కమిటీ చైర్మన్ ధరంపల్ అగర్వాల్, సభ్యులు సంతోష్, కేంద్రే శివాజీ, పరమేశ్వర్, కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్యుత్‌ను సరఫరా చేయాలి

● రాష్ట్ర విద్యుత్ శాఖ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి ● ఆదిలాబాద్ సర్కిల్ అధికారులతో సమీక్షా సమావేశం ● పాల్గొన్న డీఈలు, ఏఈలు



మాట్లాడుతున్న విద్యుత్ శాఖ సీఎండీ వరుణ్‌రెడ్డి



సమావేశానికి హాజరైన విద్యుత్ శాఖ అధికారులు

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 20: వినియోగదారులకు నాణ్యమైన నిరంతర విద్యుత్‌ను సరఫరా చేయాలని విద్యుత్ శాఖ సీఎండీ కర్నాటి వరుణ్‌రెడ్డి అన్నారు. శనివారం జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో ఆదిలాబాద్ సర్కిల్ విద్యుత్ శాఖ అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గృహ వినియోగదారుల కుల ధ్రువీకరణ పత్రాలు సేకరించి ప్రభుత్వం చేపడుతున్న పథకాలు దక్కే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. వినియోగదారుల నుంచి పాత బకాయిలను ఎప్పటికప్పుడు వసూలు చేయాల్సిందిగా ఆదేశించారు. వ్యవసాయానికి అవసరమైన విద్యుత్ కనెక్షన్లను త్వరగా మంజూరు చేయాలన్నారు. రైతులు కెపాసిటర్లను ఏర్పాటు చేసుకునే విధంగా ప్రోత్సహించి ఆటో స్టార్టర్లను తొలగించుకునే విధంగా అవగాహన కల్పించాలన్నారు.దీంతో ట్రాన్స్‌ఫార్మర్ల మీద లోడ్ తగ్గుతుందన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల మరమ్మత్తులను తగ్గించుకునేందుకు సక్రమంగా నిర్వాహణ చేపట్టాలన్నారు. 33కేవీ, 11కేవీ విద్యుత్ అంతరాయాలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, క్రమం తప్పకుండా 33/11కేవీ సబ్‌స్టేషన్ల నిర్వాహణ చేపట్టి సబ్‌స్టేషన్లలో లాగ్‌బుక్, ఎల్‌సీ బుక్, ఇన్‌ట్రాప్షన్ బుక్, ఇతర రిజిస్ట్రర్లను ఏడీఈ, డీఈలు పర్యవేక్షించాలన్నారు. నూతన గృహ, వాణిజ్య, పరిశ్రమల సర్వీసు కనెక్షన్ల మంజూరులో జాప్యం చేయకూడదన్నారు. విద్యుత్ వినియోగదారులందరికి నిరంతర విద్యుత్ సేవలను అందించి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కారం చేసే దిశగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్ఈ సంపత్‌కుమార్, ఇతర అధికారులు, డీఈలు, ఏఈలు, తదితరులు పాల్గొన్నారు.

గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు చేయండి

● జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో కలెక్టర్ రాహుల్‌రాజ్ ● రూరల్ మండలంలోని పోలింగ్ కేంద్రాల పరిశీలన



● పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న కలెక్టర్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 20: గణతంత్ర దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా అధికారులతో గణతంత్ర దినోత్సవ వేడుకల నిర్వహణపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ గత సంవత్సరం మాదిరిగానే ఈ సంవత్సరం పోలీసు పరేడ్, జాతీయ పతాకావిష్కరణ, సాంస్కృతిక కార్యక్రమాల ఏర్పాటు, ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ప్రశంస పత్రాల బహుకరణ కార్యక్రమాలను ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమాలకు హాజరయ్యే ముఖ్య అతిథులకు, ప్రజాప్రతినిధులు, ప్రజలకు, తాగునీరు, టెంట్లు వంటి ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్య అతిథిగా సందేశానికి ఈనెల 22లోగా అధికారులు తమ శాఖలకు సంబంధించిన సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలపై నివేదికను జిల్లా పౌరసంబంధాల అధికారికి సమర్పించాలని సూచించారు. విద్యార్థులతో సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేయాలని జిల్లా విద్యాశాఖాధికారిణి ఆదేశించారు. ఆయా శాఖల అభివృద్ధిని తెలిపే విధంగా స్టాల్స్ ఏర్పాటుతో పాటు శకటాలను రూపొందించాలని ఆదేశించారు. ఉత్తమ సేవలందించిన ఉద్యోగులకు ఇచ్చే ప్రశంస పత్రాలను సిబ్బంది పేర్లను పంపించాలని అధికారులను ఆదేశించారు. ఇందులో అదనపు కలెక్టర్ శ్యామలదేవి, ఆర్డీవో స్రవంతి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

● అర్హులను ఓటరుగా నమోదు చేయించాలి

మావల: అర్హులైన ప్రతీ ఒక్కరికి ఓటరుగా నమోదు చేయించాలని కలెక్టర్ రాహుల్‌రాజ్ అధికారులను ఆదేశించారు. శనివారం ఆదిలాబాద్ రూరల్ మండలం కచ్‌కంటి, అనుకుంట గ్రామాలలో ఆయన పర్యటించి పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనకు అర్హులైన ప్రతీఒక్కరిని ఓటరుగా నమోదు చేయించాలని అన్నారు. 18ఏళ్లు నిండిన యువత, అలాగే మరణించిన, చిరునామా మార్పు వంటి ఓటర్ల వివరాలను క్షేత్రస్థాయిలో పరిశీలించాలని పలు ఆదేశాలు జారీ చేశారు. అలాగే ఈనెల 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాటు చేయాలని అన్నారు. ఆ తర్వాత అనుకుంట ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులతో మాట్లాడుతూ మధ్యాహ్న భోజనం వివరాలు, గణితం టేబుల్స్, పద్యాలను అడిగి సమాధానాలను రాబట్టారు. ఇందులో తహసీల్దార్ దిలీప్‌కుమార్, ఆయా బూత్‌స్థాయి అధికారులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, యువత, తదితరులు పాల్గొన్నారు.



పాఠశాల విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

'చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి'

తలమడుగు, జనవరి 20: మహిళలందరూ చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని బాలికల సంరక్షణ అధికారి కృష్ణవేణి కోరారు. శనివారం మండలకేంద్రంలోని వసుంధర మండల సమైక్య కార్యాలయంలో నిర్వహించిన అవగాహన సదస్సులో వారు మాట్లాడుతూ జాతీయ బాలికల దినోత్సవ వారోత్సవాలు ప్రతీ సంవత్సరం జనవరి 24న నిర్వహించుకుంటామన్నారు. సమైక్య ప్రెసిడెంట్ ప్రమీల బాయ్ మాట్లాడుతూ ఈ సమావేశంలో బాలికల సంరక్షణ, హక్కులు, ఆరోగ్యం, విద్య, సామాజిక ఎదుగుదల మొదలైన అంశాలపై చర్చించుకోవడం జరిగిందని అన్నారు. అనంతరం మహిళా సాధికారత స్పెషలిస్టు కృష్ణవేణి భేటీ బచావో భేటీ పడావోపై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో సఖీ సిబ్బంది నాగమణి, మహిళ సాధికారత నిఖిలేశ్వర్, మండల సమైక్య డీఆర్పీ సర్ప్ డీపీఎం శోభారాణి, డీపీఎం మార్కెటింగ్ శోభరాణి, ఏపీఎం ఆర్‌స్వామి, తదితరులున్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు

నాగోబా జాతర పోస్టర్ల ఆవిష్కరణ

ఉట్నూర్, జనవరి 20: ఫిబ్రవరి 9 నుంచి ప్రారంభంకానున్న ఇంద్రవెల్లి మండలంలోని కేస్లాపూర్ నాగోబా జాతర పోస్టర్లను శనివారం ప్రజా ప్రతినిధులు, అధికారులు విడుదల చేశారు. మండలకేంద్రంలోని కేబీ కాంప్లెక్స్‌లో ఉన్న పీఎంఆర్సీ భవనం ఎదుట ఆదివాసీల ఆరాధ్య దైవం నాగోబా జాతర పోస్టర్లను ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్, ఆసిఫాబాద్ ఎమ్మెల్యే కోవ లక్ష్మి, ఎమ్మెల్సీ దండె విఠల్, రాష్ట్ర మహిళ కమిషన్ సభ్యురాలు కుమ్ర ఈశ్వరీబాయి, ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయి ఆవిష్కరించారు. ఇందులో ఎంపీపీ పంద్ర జైవంత్‌రావు, అధికారులు, మేస్రం వంశీయులు నాగనాథ్, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.

కేస్లాపూర్‌కు చేరిన ప్రచార రథం

ఇంద్రవెల్లి, జనవరి 20: రాష్ట్ర పండుగగా గుర్తింపు పొందిన ఆదివాసీ ఆరాధ్యదైవం కేస్లాపూర్ నాగోబా జాతరకు పుష్యమాసం అమావాస్యను పురస్కరించుకొని ఫిబ్రవరి 9న నిర్వహించే మహాపూజ కోసం ప్రారంభించిన ప్రచారరథం శనివారం కేస్లాపూర్‌కు చేరింది. ఈ నెల 13న నెలవంక దర్శనం చేసిన మెస్రం వంశీయులు ఈనెల 14న కేస్లాపూర్ నుంచి ప్రారంభించిన మెస్రం వంశీయుల ప్రచార రథయాత్ర సిరికొండ మండలానికి చేరిన నాగోబా మహాపూజకు అవసరమైన కుండల తయారీకి ఆదేశాలు ఇచ్చారు. అక్కడి నుంచి సిరికొండ, ఇచ్చోడ, గుడిహత్నూర్, ఉట్నూర్, ఇంద్రవెల్లి, మండలాల్లోని మెస్రం వంశీయులు ఉన్న గ్రామాలను సందర్శించి పవిత్ర గంగాజలం సేకరణ, నాగోబా మహాపూజ, జాతర నిర్వహణపై ప్రచారం చేశారు. ఆయా గ్రామాల్లోని మెస్రం వంశీయులు, కటోడా మెస్రం కోసేరావు, ప్రధాన్ మెస్రం దాదారావులకు అతిథి మర్యాద చేశారు. శనివారం సాయత్రం మండలంలోని వడ్‌గాం నుంచి కేస్లాపూర్ గ్రామానికి చేరుకున్నారు.

● నేడు గంగా జలం కోసం పయనం

మహాపూజ నిర్వహణ, పాదయాత్రపై ఆదివారం మెస్రం వంశీయులు సమావేశం కానున్నారు. గంగాజలం సేకరించాడానికి పాదయాత్రగా బయల్దేరనున్నట్లు ఆలయ పీఠాధిపతి మెస్రం వెంకట్రావు తెలిపారు.

లోక్ అదాలత్‌లో కేసుల పరిష్కారం

● జిల్లా న్యాయాధికారి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్

ఇంద్రవెల్లి, జనవరి 20: రాజీ చేసుకునే కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని జిల్లా న్యాయాధికారి సీహెచ్ వీఆర్ఆర్ వరప్రసాద్ అన్నారు. శనివారం మండలంలోని హీరాపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని లాల్‌టేకిడి గ్రామంలో జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థల ఆధ్వర్యంలో న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా న్యాయాధికారి మాట్లాడుతూ కక్షిదారులు రాజీ పడే కేసులను లోక్ అదాలత్‌లో పరిష్కరించుకోవాలని, లోక్ అదాలత్‌లో ఇచ్చే తీర్పు తుదితీర్పుగా ఉంటుందన్నారు. న్యాయం ప్రతీఒక్కరి హక్కు అని అన్నారు. చట్టాలపై అవగాహన ఎంతో అవసరమని పేర్కొన్నారు. ప్రతీ ఒక్కరికి చట్టాల గురించి తెలియాలని, మారుమూల గ్రామాల్లో న్యాయ విజ్ఞాన సదస్సులు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో న్యాయ సేవాధికార సంస్థ జిల్లా ప్రధాన కార్యదర్శి క్షమదేశ్ పాండే, బోథ్ న్యాయాధికారి హుస్సేన్, ఎస్సై దుబ్బాక సునీల్, సర్పంచ్ గోడం నాగోరావు, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న జిల్లా న్యాయాధికారి వరప్రసాద్